# వైద్యులుండరు.. వైద్యం అందదు..!

- మందులు సైతం కరువు
- ఖైరతాబాద్ వెల్‌నెస్ సెంటర్‌లో రోగుల ఇక్కట్లు
- ఆందోళన చెందుతున్న ఉద్యోగులు, జర్నలిస్టులు


ఖైరతాబాద్ వెల్‌నెస్ సెంటర్‌లో బారులు తీరిన రోగులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 7 : ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్లు రోజురోజుకు నిరాదరణకు గురవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు, జర్నలిస్టుల కోసం నగరంలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్‌లోని 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి రెండో అంతస్తులో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. నాడు మెడికల్ ఓపీ, పీడియాట్రిక్, డెంటల్, ఆప్తమాలజీ, అయూష్ విభాగంలోని హోమియోపతి, ఆయుర్వేదం, యూనానీ, అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే, ఫిజీయోథెరపి, గైనకాలజీ తదితర విభాగాలను ఏర్పాటు చేశారు. అదే సమయంలో అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులకు మందులు అందుబాటులో ఉండేవి.

**ఏడాదిన్నర కాలంగా నిరాదరణ**

గత ఏడాదిన్నర కాలంగా వెల్‌నెస్ సెంటర్లు నిరాదరణకు గురవుతూ వస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. గతంలో అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉండేవారు. అత్యవసర పరిస్థితులు ఉంటే నిమ్స్, ఉస్మానియా, గాంధీతోపాటు పలు ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానలకు సైతం కనెక్టివిటీ ఉండేది. వైద్యుల రిఫరెన్స్ మేరకు రోగులు ఆయా ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు పొందేవారు. కాని ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నదని చెబుతున్నారు. పదవీ విరమణ పొందిన వారిని తొలగించాలంటూ ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో, సర్క్యులర్‌లతో వెల్‌నెస్ సెంటర్‌లోని నలుగురు జనరల్ ఫిజీషియన్స్, ఒక ఆప్తాలమిస్ట్‌ను తొలగించారు. మరికొందరు ఇక్కడ పనిచేయడం ఇష్టం లేక ఇతర ఆస్పత్రులకు వెళ్లినట్లు తెలిసింది. ఫలితంగా దవాఖానల్లో వైద్యుల కొరత వేధిస్తోంది.

**మధుమేహ రోగులకు శాపం**

ఖైరతాబాద్ వెల్‌నెస్ సెంటర్‌లో రక్త పరీక్షల కోసం ల్యాబ్‌లు ఉన్నా వైద్యుడు వచ్చి రాసినప్పుడే పరీక్షలు నిర్వహిస్తున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ పరీక్షల కోసం ఎలాంటి ఆహారం తీసుకోకుండా ఉదయాన్నే ఆస్పత్రికి వస్తుంటారు. అయితే 9.30గంటలు దాటితే కాని వైద్యులు వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఔట్ పేషెంట్ సర్వీస్ ఆలస్యంగా ప్రారంభమవుతుండగా వారి నంబర్ వచ్చే సరికి మధ్యాహ్న భోజన సమయమవుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా మధుమేహపరీక్షల్లో హెచ్చు తగ్గులు వస్తున్నాయంటూ వాపోతున్నారు.

**వేధిస్తున్న మందుల కొరత**

ఖైరతాబాద్ వెల్‌నెస్ సెంటర్‌కు నిత్యం 350 మంది రోగులు వివిధ చికిత్సల కోసం వస్తుంటారు. ఆస్పత్రిలో ఇచ్చే మందులు, సరఫరా చేసే ఫార్మా కంపెనీలను నిమ్స్ దవాఖాన ద్వారా ఎంపిక జరుగుతుంది. వారు నిర్ణయించిన రేట్ కాంట్రాక్ట్ మేరకే ఇక్కడ మందులను అందజేస్తుంటారు. రెండేండ్ల కాలపరిమితి కలిగిన కాంట్రాక్ట్ ముగియడంతో ప్రస్తుతం మందుల కొరత ఏర్పడినట్లు తెలుస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులకు సరిపడా మందులు అందుబాటులో లేవంటూ రోగులు ఆరోపిస్తున్నారు.

**వైద్యుల నియామకం కోసం కలెక్టర్‌కు లేఖ రాశాం..**

ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీవోతో వివిధ విభాగాల వైద్యులను తొలగించాల్సి వచ్చింది. నూతనంగా నియామకం కోసం జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశాం. త్వరలోనే నియామకాల ప్రక్రియ పూర్తవుతుంది. రెండేండ్ల కాలపరిమితి గల రేట్ కాంట్రాక్ట్ ముగియడంతో మందుల కొరత ఏర్పడింది. ప్రస్తుతం నూతన రేట్ కాంట్రాక్ట్ ద్వారా సుమారు 2వేల రకాల మందులు, కాంబినేషన్ డ్రగ్స్ అందుబాటులోకి వస్తాయి.

– జేఈవో బాలకృష్ణ, ఖైరతాబాద్ వెల్‌నెస్ సెంటర్

## ఓయూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ హెడ్‌గా ప్రొ. సతీశ్‌కుమార్



ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ గా ప్రొఫెసర్ పి సతీష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన హెడ్ గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను విద్యార్థులు కలిసి పుష్పగుచ్ఛం తో స్వాగతం తెలిపి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకుడు తోట శ్రీనివాస్, పరిశోధక విద్యార్థులు రవీందర్, వినోద, భాగ్య పాల్గొన్నారు.

## నేడు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 7: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై మంగళవారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యల్లో తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను సైతం మార్చి నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రం తీసుకురావడం అన్యాయమనిపేర్కొన్నారు.

## 'ఆరోగ్యమే అసలైన సంపద'

కాచిగూడ : ఆరోగ్యమే అసలైన సంపదని, అందుకు ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం బ్లీస్‌బర్గ్ ఫీచర్ ఆఫ్ హోప్ సంస్థ ఆధ్వర్యంలో అందరికీ మంచి ఆరోగ్యం 2025 అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కుమారస్వామి హాజరై మాట్లాడుతూ.. నీవు తినేదే నీ ఔషధం.. ఆరోగ్యమే నీకు సర్వస్వం అని పేర్కొన్నారు.

## ఐఐఎంసీలో అష్టావధానం


అష్టావధానంలో పాల్గొన్న వక్తలు, అవధాని, ఎంబీబీఎస్ విద్యార్థి సుసర్ల సుధన్య

ఖైరతాబాద్, ఏప్రిల్ 7: లక్డీకాపూల్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో సోమవారం అష్టావధానం నిర్వహించారు. యువ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, ఐఐఎంసీ కళాశాల ఆధ్వర్యంలో తెలుగు–వెలుగు కార్యక్రమంలో భాగంగా అష్టావధరం ఏర్పాటు చేశారు. ధర్మప్రచారకులు డక్టార్ చూడామణి రామాయణ కృతులు, సాహితీ సౌరబాలు తదితర అంశాలపై మాట్లాడారు. రామాయణంలోని విశిష్టతలు, సాహిత్య అంశాలను నేర్చుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆచార్య ఫణీంద్ర, ఎం. దత్తాత్రేయ శర్మ, సీ. రామకృష్ణారావు, ఎం.లక్ష్మి, మానస, ఆచార్య ఎం. సూర్యనారాయణమూర్తి అడిగిన ప్రశ్నలకు అవధాని, ఎంబీబీఎస్ విద్యార్థి సుసర్ల సుధన్య చక్కగా సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల సమస్యలను పరిష్కరించాలి

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 7: నగరంలోని దళిత సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి నగర అధ్యక్షుడు ఆరుట్ల రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ రంగ సంస్థలు ప్రభుత్వాల నుంచి పలు రాయితీలు పొందుతున్నప్పటికీ రిజర్వేషన్లు లేకపోవడంతో దళితులకు ప్రైవేట్ రంగంలో ప్రాధాన్యం లేకుండా పోతున్నదన్నారు. రోజురోజుకు ప్రైవేట్ రంగం విస్తరిస్తున్నందున వెంటనే రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో దళితులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

## 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలి

రవీంద్రభారతి, ఏప్రిల్ 7 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే 42 శాతం బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పొందపరచాలని తెలంగాణ పోరాట యోధుడు, బీసీ ఆజాదీ జేఏసీ చైర్మన్ బత్తుల సిద్దేశ్వర్ పటేల్ ఢిల్లీలో బీసీ రిజర్వేషన్ల సాధనకోసం చేస్తున్న ఆమరణ నిరాహారదీక్షకు పలు బీసీ సంఘాలు సంఘీభావం ప్రకటించాయని నేషనల్ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ తెలిపారు. సిద్దేశ్వర్ ఢిల్లీలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష నేటికి 7వ రోజుకు చేరుకున్నదని రామకృష్ణ పేర్కొన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రామకృష్ణ వివిధ బీసీ సంఘాల నేతలు నరేందర్‌గౌడ్, ప్రసాద్ గౌడ్,కిరణ్‌కుమార్‌గౌడ్, సతీశ్‌కుమార్ పటేల్‌తో కలిసి మాట్లాడుతూ.. పటేల్ ఆరోగ్యం క్షిణించిందని, తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని నిరాహార దీక్ష విరమింపచేయాలని కోరారు.

## నిరుపయోగంగా కాటేదాన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి

- మరో చోట ఏర్పాటు చేయాలి : బీఆర్ఎస్


కాటేదాన్‌లో నిరుపయోగంగా ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 7: అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిరుపయోగంగా మారుతున్నాయని మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్ అన్నారు. సోమవారం కాటేదాన్ స్వప్న థియేటర్ సమీపంలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జిని స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. గతంలో కాటేదాన్ ప్రాంతం లో ప్రజలు రోడ్డు దాటేందుకు మున్సిపల్ అధికారులు ఆగమేఘాలమీద ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించారని అన్నారు. నిరుపయోగకరంగా ఉన్న ఈ బ్రిడ్జి తర్వాత మూసి వేశారన్నారు. దాంతో ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ అసాంఘిక శక్తులకు నిలయంగా మారిందన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్ పోలీస్‌స్టేషన్ ముందు నిర్మించినట్లయితే విద్యార్థులకు, పాదాచారులకు ఉపయోగకరంగా ఉండేదన్నారు. ఇప్పటికైనా కార్పొరేటర్, ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి సాయిబాబానగర్, మార్కండేయనగర్, బాబుల్‌రెడ్డి నగర్, మైలార్‌దేవ్‌పల్లి జడ్పీ హైస్కూల్ ముందు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుకుంటునారన్నారు. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు.

ట్రాఫిక్ సమస్య, రోడ్డు ప్రమాదాల దృష్ట్యా అవసరమైన చోట నిర్మించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఆయన వెంటనే రాము యాదవ్, రమేశ్ ముదిరాజ్, మైసిరెడ్డి, రాఘవేందర్ యాదవ్, ఎల్. రాజు, అరుణ్ ముదిరాజ్, రాజు, ఉప్పల్ శ్రీను, సురేశ్ ముదిరాజ్, వెంకటరమణ, భగవాన్ దాస్, బాలరాజ్‌యాదవ్, అశోక్‌కుమార్, కార్తిక్ ముదిరాజ్, క్రాంతిరాజ్ కుమార్, సునీల్, రాయుడు తదితరులు ఉన్నారు.

## అలరించిన లవకుశ నాటకం


కళాకారులతో ఆలయ కమిటీ ప్రతినిధి, బీఆర్ఎస్ నాయకుడు సురభి రమేశ్‌రావు

మియాపూర్, ఏప్రిల్ 7:శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఈస్ట్ సాయినగర్ సాయిబాబా ఆలయంలో లవకుశ పౌరాణిక నాటక ప్రదర్శనను సోమవారం చేపట్టారు. 50 మంది కళాకారులు నాటక ప్రదర్శనలో పాల్గొన్నారు ఆలయ కమిటీ ప్రతినిధి, బీఆర్ఎస్ నాయకుడు సురభి రమేశ్‌రావు కళాకారులకు జ్ఞాపికలు అందజేసి సన్మానించారు.

మరుగున పడుతున్న పౌరాణిక కళలను సంరక్షించుకోవాలి బాధ్యత అందరిపై ఉన్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కపిల్‌రాజ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేదలకు నాణ్యమైన వైద్య సేవలందిస్తాం..


- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 7: పేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే ధ్యేయమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. సోమవారం శంషాబాద్ మండలంలోని పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలు వురికి అధికారులతో మాట్లాడి సీఎం సహా య నిధి చెక్కులు అందించామన్నారు. వివిధ గ్రామాలకు చెందిన 21 మంది బాధితులకు దాదాపు రూ. 10లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, నీరటి రాజుముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు దండు ఇస్తారి, రమేశ్‌యాదవ్, రాజ్‌కుమార్, సిద్ధులు, సహకార సంఘం చైర్మన్ దవాణాకర్‌గౌడ్, వైస్ చైర్మన్ ప్రభుసాగర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**మణికొండ మున్సిపాలిటీ పరిధిలో..**

మణికొండ : మణికొండ మున్సిపాలిటీ పరిధి శివాజీనగర్‌కు చెందిన తోకటి రేఖ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ దవాఖానలో చికిత్సపొందుతున్నది. కాగా ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడంతో ఆమెకు రూ. 60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. సోమవారం ఆ చెక్కును ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాజీ కౌన్సిలర్ కే. రామకృష్ణారెడ్డి స్థానిక నాయకులతో కలిసి బాధితురాలికి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బుదోళ్ల శ్రీరాములు, మాజీ కౌన్సిలర్ లావణ్యానరేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మిశ్రీ, నాయకులు శ్రవణ్, శివగంగ, గంగాధర్, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి పేదలకు వరం : కార్పొరేటర్


బాధితురాలి కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 7: ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఖైరతాబాద్ కార్పొరేటర్ పి. విజయారెడ్డి అన్నారు. కింగ్ కోఠికి చెందిన ఫరీదాబి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా బంజారా హిల్స్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నది. మెరుగైన చికిత్స కోసం సీఎం సహాయనిధి పథకానికి దరఖాస్తు చేసుకోగా రూ. 60 వేలు మంజూరయ్యాయి. సోమవారం ఆ చెక్కును కార్పొరేటర్ ఫరీదాబి కుటుంబసభ్యులకు అందజేశారు.

## జేఎన్‌టీయూలో అవకతవకలపై విచారణ జరిపించాలి

- గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్


మాట్లాడుతున్న శరత్‌నాయక్ తదితరులు


ఖైరతాబాద్, ఏప్రిల్ 7 : జవాహర్ లాల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ పరీక్షల విభాగంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది జూన్‌లో జేఎన్‌టీయు హెచ్ పరీక్షల విభాగంలో అవతవకల విషయం వెలుగు చూడగా, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామిషన్స్‌పై అప్పటి ఇన్‌చార్జి వీసీ బాలకృష్ణా రెడ్డి ఆమెను ఆ విధులను తొలగించారన్నారు. తక్షణమే విచారణ కమిటీ కూడా వేశారని, అయితే ఆ నివేదిక రాకముందే సదరు వీసీ బదిలీ అయ్యారని తెలిపారు. అనంతరం వచ్చిన వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి మళ్లీ అమెను కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామిషన్స్‌గా నియమించారన్నారు. ఈ పోస్టులో గిరిజన మహిళా ప్రొఫెసర్‌కు అన్యాయం సైతం జరిగిందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నేటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లకు కాకుండా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని తిరిగి నియమించడం ఎంత వరకు సమంజసమన్నారు. దీనిపై త్వరలోనే గవర్నర్‌ను కలిసి పూర్తి వివరాలను అందజేస్తామన్నారు. త్వరలోనే విద్యార్థి సంఘాలతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బా నాయక్, చీఫ్ కోఆర్డినేటర్ రమేశ్ నాయక్, విజయేందర్ పవార్, హనుమంతునాయక్, ప్రసాద్ నాయక్, సతీశ్‌నాయక్, వినోద్‌నాయక్, చందూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పలుచోట్ల చలివేంద్రాలు ప్రారంభం


రామంజాపూర్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహేశ్‌కుమార్, తదితరులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 7 : మండలంలోని రామంజాపూర్ గ్రామం వద్ద స్థానిక నాయకుడు మహేశ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు వేసవిలో తాగునీరందించడం కోసం చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. చలివేంద్రాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, మాజీ ఉప సర్పంచ్ రఘునందన్‌రెడ్డి,మాజీ ఎంపీటీసీ మాధవరెడ్డి, ఎల్లయ్య, జంగయ్య, ప్రకాశ్, ఈశ్వర్‌చారి, సత్తయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

**కార్మికనగర్‌లో..**


చలివేంద్రం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, నవీన్‌యాదవ్

జూబ్లీహిల్స్,ఏప్రిల్ 7: రహమత్ నగర్ డివిజన్ కార్మికనగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, నవయువ నిర్మాణ్ అధ్యక్షుడు నవీన్‌యాదవ్ ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు.

## 16న తైబజార్ వేలంపాట

దుండిగల్ : దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో తై బజార్ వేలం పాటను 16న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్ తెలిపారు. ఔత్సాహిక గుత్తేదారులు 15వ తేదీ 11 గంటలలోపు దుండిగల్ పురపాలక సం ఘం కార్యాలయంలో రూ.లక్ష డీడీతోపాటు సాల్వెన్సీ సర్టిఫికెట్ అందజేయాల్సి ఉంటుందన్నారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తామన్నారు.

## డంపింగ్ యార్డ్ కాదు.. బ్యాంబూస్ పార్కు

- చెత్తాచెదారంతో నిండినా పట్టించుకోని బల్దియా అధికారులు


జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లో బ్యాంబూస్ పార్కులో పేరుకుపోయిన చెత్తచెదారం


బంజారాహిల్స్, ఏప్రిల్ 7: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం ఉంటున్న జూబ్లీహిల్స్‌లో సైతం పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో చెత్తాచెదారంతో కంపుకొడుతున్నాయి.

జీహెచ్ఎంసీ సర్కిల్ –18 పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36 ప్రధాన రహదారిలో పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో సుమారు ఎకరంవిస్తీర్ణంలో బ్యాంబూస్ పార్కు ఉన్నది. బల్దియాకు చెందిన ఈ పార్కులో భారీ వెదురు వృక్షాలతో పాటు యూకలిప్టస్ చెట్లు ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హరిత హారం కార్యక్రమంలో భాగంగా అనేక పార్కులను అభివృద్ధి చేసింది. ఈ క్రమంలోనే జూబ్లీ హిల్స్ రోడ్ నంబర్ 36లోని బ్యాంబూస్ పార్కులో సైతం వందలాది మొక్కలు నాటారు. పార్కులో సందర్శకులు కూర్చునేందుకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయడంతో పాటు వాకర్స్ కోసం మెట్లు, వాకింగ్ ట్రాక్‌ను నిర్మించారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్కు నిర్వహణను గాలికొదిలేశారు. దాంతో పార్కులో పిచ్చిమొక్కలు పెరిగాయి. పార్కు గేట్‌ను విరగ్గొట్టిన ఆకతాయిలు లోపల కూర్చుని మద్యం సేవిస్తున్నారు. అంతేకాకుండా సమీపంలోని దుకాణదారులతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది చెత్తాచెదారాన్ని తీసుకువచ్చి పార్కులో వేయడం ప్రారంభించారు. పక్కనున్న భవనాల డ్రైనేజీ నీరు పార్కులోకి వదిలిపెడుతుండడంతో మురుగు గుంట ఏర్పడింది. దాంతో బ్యాంబూస్ పార్కు డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. తీవ్రమైన దుర్వాసనలతో పాటు దోమలకు నిలయంగా మారింది.

**కన్నెత్తి చూడని అధికారులు**

జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ విభాగం అధికారులు పార్కువైపు కన్నెత్తి చూడటంలేదని, చెత్తను శుభ్రం చేయాల్సిన శానిటేషన్ విభాగం సైతం ఏ మాత్రం పట్టించుకోవడంలేదని సమీప కాలనీలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే పార్కు ముందు నుంచి నిత్యం సీఎం కాన్వాయ్ వెళ్తున్నా అధికారులకు చీమకుట్టినట్లయినా లేదంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బ్యాంబూస్ పార్కు నిర్వహణపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

## కళారంగాల్లో పిల్లలను ప్రోత్సహించాలి



తెలుగుయూనివర్సిటీ, ఏప్రిల్ 7 : అక్షయ సామాజిక, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో పలువురికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చిన్నారి కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నత్య ప్రదర్శనలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. అడిషనల్ డీసీపీ రాందాస్‌తేజ, నృత్య గురువులు డాక్టర్ రేవతి, డాక్టర్ చింతా కృష్ణప్రియ, డాక్టర్ చల్లా యామిని, సంధ్యలక్ష్మి, తులసి, సంధ్యారాణి, మెట్రో టీవీ అధినేత జయప్రసాద్ పాల్గొని ఆయా రంగాలలో రాణిస్తున్న వారికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. చి న్నారులను ప్రోత్సహించడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని వక్తలు తెలిపారు. పురస్కారగ్రహీతలను ప్రోత్సహించేలా పురస్కారాలు అందించడం ముదావహమని సంస్థ నిర్వాహకుడు సీహెచ్ సీతారామ్ కృషిని ప్రశంసించారు.

## సమాజ సేవకులు.. జర్నలిస్టులు

- రాజేంద్రనగర్‌లో ఘనంగా జర్నలిస్టుల క్రీడాపోటీలు



క్రీడాపోటీల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్త, పాల్గొన్న జర్నలిస్టుల కటుంబసభ్యులు


వ్యవసాయ యూనివర్సిటీ , ఏప్రిల్ 07: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ క్రీడా మైదానంలో సోమవారం రాజేంద్రనగర్ జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్ జరిగింది. జర్నలిస్టుల కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ కళాకారుడు శుభోదయం సుబ్బారావు, పృథ్వీరాజ్ పాల్గొని మాట్లాడారు. సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైందని, జర్నలిస్టులు సమాజ సేవకులని అన్నారు. జర్నలిస్టులకు క్రికెట్, వారి కుటుంబసభ్యులకు క్విజ్, మ్యూజికల్ చైర్స్, కోకో, వాలీబాల్, రన్నింగ్, క్విజ్, వ్యాస రచన, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. సొంత ఖర్చులతోనే ఫ్రెండ్స్ క్రికెట్ అసోసియేషన్ పేరుతో పోటీలు నిర్వహించినట్లు సీనియర్ పాత్రికేయులు తెలిపారు. ఏ టీమ్‌కు వర్కాల చందు, బీ టీమ్‌కు యు. శ్రీకాంత్ కెప్టెన్లుగా వ్యవహరించారు. పాత్రికేయులు మేకల దామోదర్‌రెడ్డి, అంజయ్యగుప్తా, కరుణాకర్, భీమయ్య, ప్రేమ్‌రాజ్, బాబూరావు, బాలసుబ్రమణ్యం, యాదగిరి, సుదర్శన్‌గౌడ్ సహకరించారు. టి. మాసయ్య తోపాటు సభ్యులు భాగస్వామ్యం వహించారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వనిత, సీనియర్ పాత్రికేయులు మ్యాడం మధుసూదన్, మురళీధర్, అమరనాథ్ పాల్గొన్నారు.

## పాస్టర్ మృతిపై సమగ్రవిచారణ చేపట్టాలి


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రిస్టియన్లు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 7 : పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని సోమవారం సాయంత్రం శంషాబాద్‌లో క్రిస్టియన్ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని క్రిస్టియన్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని సిద్దాంతి వాటర్ ట్యాంక్ నుంచి ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని కొవ్వొత్తులు వెలిగించారు. మైనార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ర్యాలీలో వివిధ చర్చిల పాస్టర్లు, నాయకులు గుంటి ప్రవీణ్‌కుమార్, గుంటి చరణ్, ఆల్బట్, పాల్సన్, శామ్‌సన్, ప్రవిత్రసాగర్, మైనార్టీ నాయకులు నజీరోద్దీన్, శుక్రుబాయి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



ఖైరతాబాద్, ఏప్రిల్ 7 : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అస్టర్ ప్రైమ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పంజాగుట్ట నెక్స్ట్ గలేరియా మాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బరువు, ఎత్తు, మధుమేహం, రక్తపోటు, హిమోగ్లోబిన్, కంటి, ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలను నిర్వహించి వైద్యం అందించారు. శిబిరాన్ని ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి సీవో డాక్టర్ దేవానంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు సమీర, లావణ్య, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక రాయితీతో పుస్తకాల విక్రయం

తెలుగుయూనివర్సిటీ, ఏప్రిల్ 7: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన గ్రంథాలను ప్రత్యేక రాయితీతో విక్రయించడానికి పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 8 నుంచి 17 వరకు నాంపల్లి ప్రాంగణంలోని పుస్తక విక్రయ కేంద్రం తెరిచి ఉంటుందని అన్నారు.